# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పవిత్ర రామ నవమి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.**

2. **మార్కాపురం జిల్లా, రాయవరం బస్సు ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**

3. **విద్య, వైద్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత గల అంశాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**

4. **రాష్ట్రంలో వంట గ్యాస్ కొరత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టంచేశారు.**

5. **మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.**

==========================

పవిత్ర రామ నవమి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగం, తపస్సు, నిగ్రహానికి మారుపేరైన శ్రీరాముని జీవితం.. ఎలాంటి పరిస్థితినైనా స్థైర్యం, సంకల్పంతో ఎదుర్కొనే స్ఫూర్తిని ప్రజలకు ఇస్తుందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

శ్రీరామచంద్రమూర్తి సుగుణాలతో ప్రతి ఒక్కరూ ఆదర్శ జీవితం గడపాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. శ్రీరామనవమి మహోత్సవం సందర్భంగా ప్రజలకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మానికి, సుపరిపాలనకు ప్రతీకగా నిలిచిన ఆదర్శ పురుషుడు, కర్తవ్య పరాయణుడు శ్రీరాముడని పేర్కొన్నారు. శ్రీరాముడు అవతరించిన రోజు, ఆయన కళ్యాణం జరిగిన రోజు శ్రీరామనవమి వేడుకలు జరుపుకుంటామని వెల్లడించారు.

ధర్మం, న్యాయం, నిజాయితీకి ప్రతీకగా నిలిచిన శ్రీరామచంద్ర ప్రభువు ప్రజలందరికీ ఆదర్శ పురుషుడని తెలంగాణ

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పరమ పవిత్రమైన శ్రీరామ నవమి మహోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ ధర్మస్వరూపుడు చూపిన మార్గంలో నడుస్తూ, మన జీవితాల్లో సత్యం, సహనం, కర్తవ్యబద్ధతను అలవర్చుకుని ఆదర్శ జీవితం గడపాలని కోరారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లా ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని శ్రీరామ నవమి వేడుకలకు సుందరంగా తీర్చిదిద్దారు. రాములవారి సన్నిధిలో ఈ రోజు ఉదయం నిర్వహించనున్న ధ్వజారోహణానికి సర్వం సిద్ధం చేశారు. శ్రీరామ నవమిని పుర స్కరించుకుని దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా క్యూలైన్లు, బారికేడ్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

తెలంగాణాలోని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈరోజు జరగనున్న సీతా రాముల కల్యాణానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి... స్వామి వారి కళ్యాణోత్సవాన్ని కుటుంబంతో కలిసి తిలకించనున్నారు. ఈ మహటరీత్సవానికి.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం మిథిలా స్టేడియాన్ని.. 24 సెక్టార్లుగా విభజించారు. మంచినీరు, మజ్జిగ సిద్ధం చేశారు.

--------------------------

మార్కాపురం జిల్లా, రాయవరం బస్సు ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోన్న వారికి 2 లక్షల రూపాయల చొప్పున సాయం అందించాలని సూచించారు. మార్కాపురం జిల్లా రాయవరం వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్ర మంత్రివర్గం నిన్న తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. బస్సు ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలిపింది. బాధిత కుటుంబాలకు రాష్ట్ర మంత్రివర్గం సానుభూతిని తెలియజేసింది. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. రాయవరం ప్రమాద ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని, దానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

--------------------------

విద్య, వైద్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత గల అంశాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వైద్యఆరోగ్య శాఖకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. శాసనసభలో ఆరోగ్య శ్రీపై నిన్న జరిగిన చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిలకు ప్రభుత్వం 2వేల 4 వందల 8 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. 2 వేల 46 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశామన్నారు. వైద్య కళాశాలల నిర్వహణను గ్రూప్-1 అధికారులకు అప్పగించే అంశాన్ని పరిశీలిస్తున్నామని పేర్కొంటూ..

వాయిస్.. 35 సెకన్స్

--------------------------

మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖ

అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, నిపుణుల సలహాలు సూచనలు తీసుకోవాలని సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఒంగోలు, మార్కాపురం సర్వజన అసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో నలుగురు పూర్తిగా కోలుకున్నారని ఈ సందర్భంగా అధికారులు మంత్రికి తెలిపారు. ప్రైవేటు కార్పొరేట్ అసుపత్రిలో ఒకరు చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. వీరందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలో వంట గ్యాస్ కొరత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొరత అంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మొద్దని ఆయన స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కు ఎలాంటి కొరత లేదన్నారు. కొరత అంటూ వచ్చిన వదంతులను నమ్మి ముందస్తుగా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారని తెలిపారు. నగరాల్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ – పిఎన్జికి మారేవారిని ప్రోత్సహిస్తామని పేర్కొంటూ..

వాయిస్...31 సెకన్స్

---------------------------

దేశంలో పెట్రోలియం, ఎల్పీజీ సరఫరా పూర్తి నియంత్రణలో ఉందని పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ తెలిపింది. అన్ని రీటెయిల్ ఇంధన అవుట్‌లెట్లలోనూ సరిపడినన్ని నిల్వలు ఉన్నాయని వెల్లడించింది. దేశ వ్యాప్తంగా ఎక్కడా పెట్రోలు, డీజిలు, ఎల్పీజీకి కొరత లేదని నిన్న ఒక ప్రకటనలో పేర్కొంది. తప్పుదోవ పట్టించేలా ఉద్దేశపూర్వకంగా చేపడుతున్న దుష్ప్రచారాన్ని నమ్మి ఆందోళనకు గురి కావద్దని ప్రజలకు సూచించింది. సామాజిక మాధ్యమాల్లో తప్పుదారి పట్టించే వీడియోలను పోస్టుల రూపంలో ప్రచారం చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు వెల్లడించింది. భారత్‌లో లాక్ డౌన్లు, ఇంధన నియంత్రణలను విధిస్తున్నారని పూర్తిగా బూటకపు వాదనలను ప్రచారం చేస్తున్నారని మంత్రిత్వ శాఖ తెలిపింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ రోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలపై దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో ఈ రోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణం కేంద్ర అధికారిణి జి. లక్ష్మి పేర్కొన్నారు. అలాగే ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని, ఈదురు గాలులు గరిష్టముగా 50 కిలోమీటర్లు వేగముతో వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మరోవైపు తెలంగాణ లో ఈ రోజు తేలికపాటి నుండి ఒక మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమురంభీమ్, ఆసిఫాబాద్, జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

======================